ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 17 సెప్టెంబరు 2024



పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం

● రేపటి నుంచే అందుబాటులోకి..

● కార్పొరేషన్ పరిధిలో మూడు క్యాంటీన్లు సిద్ధం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16 : పేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పునఃప్రారంభిస్తున్న అన్నక్యాంటీన్లు జిల్లాలో ఈనెల 18వ తేదీ బుధవారం నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే కడప నగరంలో మూడుచోట్ల జడ్పీ కార్యాలయం ఆవరణం, పాతబస్టాండు, మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ క్యాంటీన్లు బుధవారం నుంచి పేదల ఆకలి తీర్చనున్నాయి. ఈ క్యాంటీన్ల ద్వారా ఉద యం టిఫిన్ రూ.5, మధ్యాహ్నం భోజనం 5, రాత్రి భోజనం 5 రూపాయలకే అందించనున్నారు. ఆహార సరఫరా బాధ్యతను అక్షయమిత్ర సంస్థకు అప్పగించారు. సోమవారం నుంచి శనివారం వరకు వారంలో ఆరు రోజులు అన్నక్యాంటీన్లు పనిచేస్తాయి. ఆదివారం సెలవు దినంగా ప్రకటించారు. ఏ రోజు ఏ టిఫిన్, ఏ ఆహారం అందిస్తారో ఫుడ్ మెనూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ నేప థ్యంలో కడప నగరంలో సోమవారం నుంచి అన్నక్యాంటిన్లు పేదల ఆకలి తీర్చనున్నాయి. ఈ క్యాంటీన్ల ద్వారా ఉదయం 7.30 నుంచి 10 వరకు టిఫిన్, మధ్యాహ్నం 12.30 నుంచి 3గంటల వరకు, రాత్రి 7.30 నుంచి 9 వరకు భోజనం అందించనున్నారు.

ఫుడ్ మెనూ ఇదే..



సోమవారం ఉదయం ఇడ్లీ, చట్నీ, సాంబారు లేదా పూరి, కుర్మా అందిస్తారు. మంగళ వారం ఉదయం ఇడ్లీ, చట్నీ, సాంబారు లేదా ఉప్మా చట్నీ, సాంబార్ మిక్చర్, బుధవారం ఉదయం ఇడ్లి, చట్నీ, సాంబారు లేదా పొంగల్, చట్నీ, సాంబారు మిక్చర్, గురువారం ఇడ్లీ, చట్నీ, సాంబారు లేదా పూరీ, కుర్మా, శుక్రవారం ఇడ్లీ, చట్నీ, సాంబారు లేదా ఉప్మా, చట్నీ, సాంబారు మిక్చర్, శనివారం ఇడ్లి, చట్నీ, సాంబారు లేదా పొంగల్, చట్నీ, సాంబార్ మిక్చర్ సరఫరా చేస్తారు. ఇక భోజనం విషయానికి వస్తే ఆరు రోజులు ఒకే మెనూ అమలులో ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి తెల్లఅన్నం, కూర, పప్పు, సాంబారు, పెరుగు పచ్చడి ఉంటుంది.

క్యాంటీన్లను పరిశీలించిన కమిషనరు

ఈనెల 18 నుంచి అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కడప మున్సిపల్ కమిషనరు వైవోనందన్ సోమవారం కడప నగరంలో గల క్యాంటిన్లను పరిశీలించారు. అక్కడి వసతులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నక్యాంటీన్లలో ప్రజలకు స్వచ్ఛమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాన్నారు. పరిసరా లు పరిశుభ్రంగా ఉండేలా... ఎంట్రెన్స్‌లో వాహనాలు అడ్డంగా లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాంటీన్లలో నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని.. ఫర్నీచర్ పరికరాల నిర్వహణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్, కిరణ్, ఏఈలు పాల్గొన్నారు.

అక్షయపాత్రలో టిఫిన్ పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్



స్కిల్లే లేదు.. గిల్లుడే

● రూ.3కోట్ల సిమెన్స్ పరికరాలకు చిలుము ● జగన్ తెచ్చిన స్కిల్‌హబ్.. మెహందీ, కుట్టు శిక్షణలకే పరిమితం

● ఉపాధిలేక యువత వలసల బాట ● కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో యువతలో చిగురిస్తున్న ఆశలు



కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 16: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.. భవిష్యత్తులో స్వయం సమృద్ధి సాధించాలి... వృత్తి నైపుణ్యంతో ఆర్థి కంగా ఎదగాలి.. అనే లక్ష్యంతో 10 ఏళ్ల కిందట చంద్ర బాబు తెచ్చిన టీఎస్‌డీఐ (టెక్నికల్ స్కిల్ డెవలమ్మెంట్ ఇన్స్టిట్యూట్) జిల్లాలో మరుగున పడింది. యువతకు విదేశాల్లో ఉపాధి కల్పించేందుకు సాంకేతిక పరిజ్ఞా నంతో ఏర్పాటు చేసిన టీఎస్‌డీఐ కోర్సులు అటకెక్కాయి. రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, కడప, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కేంద్రాల్లో నెలకొల్పిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు 2016-19 కాలంలో యువత శిక్షణలతో కళకలలాడాయి. ఏటా వేలాదిమంది యువత శిక్షణ పొంది అనంతపురం కియా, కాళహస్తి శ్రీసిటి, డైకిన్, శాంసంగ్ లాంటి పెద్ద కంపెనీలతో పాటు గల్ఫ్‌దేశాల్లో రాణిస్తున్నారు. అప్పట్లో యువత శిక్షణ కోసం సీమెన్స్ కంపెనీ నుంచి అత్యాధునిక యంత్రాలు దాదాపు రూ.3కోట్లతో కొను గోలు చేశారు. ప్రజల సొమ్ముకు జవాబుదారీగా పని చేయాల్సిన జగన్ సర్కారులో ఈ యంత్రాలను పట్టించుకునే వారు లేక చిలుము పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. చంద్రబాబు హయంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ పేరును కాస్త గత జగన్ ప్రభుత్వంలో స్కిల్ హబ్‌లుగా మార్పు చేసి... వైసీపీ పెద్దల అడ్డగోలు సంపాదనకు కేంద్రాలుగా మార్చారనే విమర్శలు న్నాయి.. అంతే కాకుండా టీఎస్‌డీఐ లాంటి సాంకేతిక విద్యకు మంగళం పాడి ఆ స్థానంలో గోరింటాకు (మెహందీ), కుట్టు శిక్షణలు, ఎంఎస్ ఆఫీసు లాంటి కోర్సులను తెచ్చి యువతకు కల్పిస్తున్న ఉపాధిని నిర్వీరం చేశారనే తీవ్ర విమర్శలు ఉన్నాయి. జగన్ అనా లోచిత నిర్ణయాలతో జిల్లాలో పెద్ద ఎత్తున యువత ఉద్యోగ, ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలస బాట పట్టిందనే అపవాదు కూడా మూటగట్టుకోక తప్పలేదు.

చంద్రబాబు హయాంలో ఉపాధికి ఊతం

యువత దేశానికి సంపద అని భావించిన ముఖ్య మంత్రి చంద్రబాబు 2014లోనే ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్)పేరుతో నెలకొల్పాడు. రూ.3కోట్ల విలువైన సిమెన్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్ర పరిక రాలు జిల్లాలో పలు ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 2016-17లో ప్రారంభమైంది. ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, బీటెక్ లాంటి విద్యనభ్యశించిన యువతకు ప్రాధాన్యతగా శిక్షణలు సాగాయి. టూ వీలర్, ఫోర్ వీలరు, ఎలక్ట్రికల్, కంప్యూటర్ బేస్, మొబైల్ ఫోన్లు, ల్యాప్ ట్యాప్‌లు, ఆగ్రోఫాం, వ్యవసాయ పరికరాల తయారీ, ఏసీల రిపేరు, సాలిడ్ ఎడ్జ్, డసాల్ట్, జావా కోర్సులతో పాటు ఎలక్ట్రానిక్ ఆఫీసు, సీఎన్‌సీ, కంప్యూ టర్ న్యూమరీ (ఏదైనా ఇనుప పరికరాలను తమకు కావాల్సిన ఆకారంలో డిజైన్ చేయడం), వెల్డింగ్, ఎలక్ట్రా నిక్ లాంటి కోర్సులతో యువత ఉపాధికి బాటలు పడ్డాయి. ఇక్కడ శిక్షణ పొందిన యువత నేడు దేశ, విదేశాల్లో అగ్రగామి కంపెనీల్లో కొలువులతో ఆర్థికంగా బలపడ్డారని తెలుస్తోంది. అంతటి అత్యాధునిక యంత్ర పరికరాలను యువత ఉపయోగించకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్ సర్కారుదే.

కుటీర పరిశ్రమల్లాగా స్కిల్ హబ్‌లు

2019-24 జగన్ ప్రభుత్వం నేషనల్ స్కిల్ డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ కింద కేంద్ర ప్రభు త్వ ప్రధానమంత్రి యోజన పథకం సహకారంతో జిల్లాలో 9 స్కిల్ హబ్ లు ఏర్పాటు చేసింది. సీడప్, న్యాక్ పేర్ల (నేషనల్ అకా డమీ సెంటర్లు)తో పులివెందుల, కడప, చక్రాయపేట, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లో సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో శిక్షణ అభ్యసించే యువత ఉన్నత విద్యకు సంబంధం లేకుండా కేవలం టెన్త్, ఇంటర్, తత్సమాన కోర్సులు చదివే వారికి గోరింటాకు డిజైన్, టైలరింగ్, అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రికల్, ఎంఎస్ ఆఫీసు మాత్రమే ఈ స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణలు ఇచ్చి సర్టి ఫికెట్లు అందజేసేవారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లొమా, బీటెక్ లాంటి సాంకేతిక విద్యలో రాణించే వారికి సం బంధం లేని కోర్సులు కావడంతో పెద్ద ఎత్తున యువత కు ఉపాధి, నైపుణ్యాభివృద్ధిలో శిక్షణలు లేక, రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాని కారణంగా పక్క రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన దుస్థితి దాపురించింది. చంద్రబాబు దూర దృష్టితో యువతకు ఉపాధి కల్పిస్తే జగన్ పాల నలో కుటీర పరిశ్రమలను తలపించేలా యువతకు శిక్ష



ణలు ఇవ్వడం చూస్తే ఐదేళ్ల పాలనలో నిరుద్యోగ యువత రోడ్డున పడక తప్పలేదు. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి.. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మొదటి నెల వ్యవధిలోనే యువతను అన్ని రంగాల్లో ప్రోత్సాహించేలా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను పునఃప్రారంభించి.. వృత్తి నైపుణ్య కోర్సులకు మరింత ఆధునిక, సాంకేతిక రంగాల్లో రాణించేలా ప్రకటన చేయడం నిరుద్యోగ యువతకు శుభపరిణామం అని చెప్పాలి.

కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం



సబ్ రిజిస్ట్రార్ల రాజ దర్బార్‌కు చెక్

● ప్రజలకు అందుబాటులో సేవలు

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 16: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజి స్ట్రార్ల రాజదర్భారుకు చెక్ పెట్టింది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజలకు సరైన రీతిలో సేవలు అందించాల్సిన సబ్ రిజిస్ట్రార్లు పెద్దపీఠంపై కూర్చొని సేవలందించాడాన్ని ప్రభుత్వం ఆక్షేపించింది. స్థిరా స్తులైన స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రభుత్వానికి లక్ష లాది రూపాయిలు రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించే వినియోగదారుడు మాత్రం సబ్ రిజిస్ట్రార్లకు తమ సమస్యలు చెప్పుకోవాల్సి వస్తే నిలబడి చెప్పాల్సిన పరిస్థితి ఉండేది. అంతే కాకుండా క్రయవిక్రయ దారులు కూర్చేవడానికి కుర్చీలు లేకపోవడం, తాగునీరు కూడా అందుబాటులో లేని విషయాన్ని ఇటీవల కడప పర్యటనకు వచ్చిన రెవెన్యూ చీఫ్ స్పెషల్ సెక్రటరీ సిసోడియా కడప అర్బన్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆక స్మిక తనిఖీ చేసి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఇక మీదట పన్నులు చెల్లించే ప్రజలకు సబ్ రిజిస్ట్రార్లు సేవలందించేలా ఉండాలని, అంతే కాకుండా కుర్చీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు సౌకర్యాలతో పాటు అవసరమైతే కాఫీ, టీలు కూడా వినియోగదారునికి మాత్రమే అం దేలా చర్యలు తీసుకోవాలంటూ నాలుగు రోజుల కిందట రాష్ట్ర వ్యాప్తం గా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు గత రెండు రోజు లుగా జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో ప్రజలకు అనుకూ లంగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండేలా చర్యలు చేపట్టారు. స్టాం పులు, రిజిస్ట్రేషన్‌శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివరామ్, జిల్లా రిజిస్ట్రార్ పీఎన్ బాబుల ఆదేశాల మేరకు సోమవారం కడప అర్బన్ కార్యాలయంతో పాటు అన్ని కార్యాలయాల్లో ప్రజలకు సబ్ రిజిస్ట్రార్లు అందుబాటులో ఉండేలా మరమ్మతు పనులతో చేర్పులు,మార్పులకు శ్రీకారం చుట్టారు. సోమవారం సెలవు రోజున జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రారు కార్యాల యాల్లో రాజదర్భారు లాంటి వాటిని తొలగించే పనిలో పడ్డారు. రెండు రోజుల్లోగా ప్రజలకు చేరువగా సబ్ రిజిస్ట్రార్లు సేవలందించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రవక్త మార్గాన్ని అనుసరించాలి

● మిలాద్ ఉన్ నబీ పర్వదిన ర్యాలీలో ముస్లిం మతపెద్దలు

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 16: ప్రజలంతా ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని ముస్లిం మతపెద్దలు కోరారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అల్మాస్‌పేట నుంచి నగర పురవీధుల మీదుగా ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశం మతసామరా స్యానికి ప్రతీకగా ఖ్యాతిగాంచిందన్నారు. పలు కులాలు, మతాలకు నిలయంగా విరాజిల్లుతోందన్నారు. ఒకరి పండుగలలో మరొకరు పాల్గొని సోదరభావంతో కలిసిపోతారన్నారు. ప్రతి మనిషి మంచి నడ వడికతో, ఇతరులకు మంచి చేయకపోయినా చెడు చేయకుండా సన్మా ర్గంలో నడిచి తద్వారా ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని దేవుని ప్రార్థించి నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద గల మసీ దులో ఖూన్‌కారిస్తా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిం చారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, ఆరి ఫుల్లా, సంఘసేవకుడు సలావుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ అహ్మద్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మిలాద్ కమిటీ అధ్య క్షుడు మహ్మద్ అలీ బగ్దాది, రెహమాన్ బగ్దాది, ఖూన్‌కారిస్తా అధ్య క్షుడు తారిక్, నాయకులు మగ్బుల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మంగంపేట అభివృద్ధికి సహకరిస్తాం

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

● 576 మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 16: తరతరా లుగా అనుబంధం కలిగిన భూములు, ఇళ్ల ను ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి ఇచ్చి మరో చోటికి వెళ్లిన మంగంపేట గ్రామ ప్రజలు గొప్ప మనసున్నవారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రా మాల ప్రజలకు పునరావాస కాలనీ అయిన ఆర్‌ఆర్-5లో నివాస స్థలాలకు ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సాయం త్రం మంత్రి పాల్గొన్నారు. మంత్రి, ఎమ్మెల్యే, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ కోలార్ అంటే గోల్డ్ మైన్స్, మంగంపేట అంటే ముగ్గురాళ్ల గనులు అని ఇదే రాష్ట్రానికి ఆదాయ వనరు అని ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమేన న్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఉన్న మైన్స్ దోచి వేసినవారు ఎవరో అంద రికీ తెలిసిన విషయమేనని, ఇసుక రాష్ట్రాన్ని దాటి చెన్నై, బెంగళూరుకు తరలించి అక్ర మంగా దోచుకున్న ఖ్యాతి గత ప్రభుత్వం మూటగట్టుకుందని, తమ ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు లేదన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న మంగంపేట గ్రామ ప్రజలకు తమ శక్తిమేర సహాయ సహకారాలు అందిస్తామని, అలాగే నియోజ కవర్గ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ నిధియాదేవి, రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, మంగం పేట గ్రామ పెద్దలు పులపత్తూరు రామసు బ్బారెడ్డి, మంగంపేట సుధాకర్, టీడీపీ సీని యర్ నాయకుడు అనుమలగుండం చంద్ర మోహన్, తహసీల్దార్ పీర్‌మున్ని, మంగం పేట సర్పంచ్ మినుకు సుధాకర్, జడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, కల్లా చలపతి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన నాయకులు జోగి నేని మణి, ప్రజలు పాల్గొన్నారు.

750 నూతన బస్సులను ప్రారంభించాం

● వచ్చే ఏడాది లోపు వెయ్యి కొత్త బస్సులు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 16: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల కాలంలో నే రాష్ట్రంలో అన్ని ఆర్టీసీ డిపోల్లో 750 నూతన బస్సులను ఏర్పాటు చేశామని, వచ్చే ఏడాది లోపు 1000 బస్సులను ఏర్పాటు చేసి మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన మండల యువ నాయకుడు, మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా అనంతపురం గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభు త్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం కోసం ప్రభుత్వం ఏర్పడిన మూడు నెల లకే 750 బస్సులను ఏర్పాటు చేశామని తెలి పారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా బటన్లు నొక్కి ప్రజలను మోసం చేశారని దుయ్యబ ట్టారు. విజయవాడలో వరదలు బీభత్సం సృష్టించినా చంద్రబాబునాయుడు అక్కడే ఉండి ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించా రని, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హెలి కాప్టర్‌లో తిరిగి వెళ్లారని ఇదీ ఇద్దరికి తేడా అని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీర్చడానికి రూ.15 కోట్లు వెచ్చించి అన్ని గ్రామాలకు శాశ్వత మంచినీటి పథకం బోర్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరును అందిస్తామన్నారు. కార్యక్ర మంలో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, మండల అధ్యక్షుడు శంకా రపు జయరాం, కుప్పం నియోజకవర్గ ఇన్‌చా ర్జ్ గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, డాక్టర్ షఫీనాయక్, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటక పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 16: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉత్తమ పర్యాటక పురస్కారాలను ప్రభుత్వం ఇవ్వనుంది. ఈనెల 27వ తేదీ పర్యాటక దినోత్సవం సందర్భంగా పురస్కారాల కోసం దరఖాస్తులు పంపుకోవాలని టూరిజం శాఖ తెలిపింది. 2023-24 సంవత్సరంలో పర్యాటక ప్రాంతాల కోసం ఉత్తమ కార్యనిర్వహణ పద్ధతులు అవలంభించిన ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యాటక అభిమానులు, సోషల్ మీడియా ప్రతినిధులకు 38 రకాల అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి కేటగిరీ నుంచి ఉత్తమ ప్రతిభ కనబరచిన వ్యక్తి లేదా సంస్థను ఎంపిక చేసి పురస్కారాలు ఇస్తారని, మరింత సమాచారం కోసం 63099 42032 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

చేనేత సంఘాలకు ఊపిరి

● ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ● డిసెంబరు 6న నూతన పాలక వర్గాలు



మైలవరం, సెప్టెంబరు 16: నేతన్నలను గత ప్రభుత్వం గాలి కొదిలేసింది. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల నుంచి రావాల్సిన రాయితీ, పరపతి రుణాలు దక్కలేదు. దుస్తులను కూడా కొనుగోలు చేయలేకపోయిందని చేనేతలు ఆరోపిస్తున్నారు. మరో వైపు బకాయిలు చెల్లింపులను నిలిపివేసింది. దీంతో చాలా మంది వృత్తిని వదిలి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు చేనేత సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంది. ఎన్నికలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈనెల 21 నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది.

అయిదేళ్లలో నిర్వీర్యం..

జిల్లాలో చేనేత, సిల్క్ సహకార సంఘాలు 184 ఉన్నాయి. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేల్ నియోజకవర్గ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. వైసీపీ హయాంలో చేనేత సహ కార సంఘాలు నిర్వీర్యమయ్యాయి. గడిచిన ఐదేళ్లుగా వీటికి ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించింది. అంతేకాకుండా ఎటువంటి నిధులు విడుదల చేయ కపోవడంతో వీటి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. నిధుల్లేక ఉత్పత్తి నిలిచిపోయి కార్మికులకు పనిలేకుండా పోయింది. దీనికి తోడు గతంలో ఉన్న యారన్‌రాయితీ, కార్మికుల వ్యక్తిగత ఆరోగ్యబీమా, రుణాలు, మార్కెట్ ఇన్సెంటివ్ వంటి పథకాలకు మంగళం పాడింది. మగ్గం ఉన్న కార్మికుడికి మాత్రమే రూ.24వేలు ఏడాదికి ఇచ్చి చేతులు దులుపుకుంది. అదే సమయంలో రంగులు, రసాయనాలు, నూలు ధరలు పెరగడంతో తయారైన వస్త్రా నికి మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో కార్మికులకు చేతినిండా పని దొరక్క అప్పులతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత కార్మికులను ఆదుకుంటామని ఎన్నికల ప్రచారంలో ప్రకటించింది. అధికా రంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడానికి చర్యలు చేపట్టింది.

ఏర్పాట్లు చేస్తున్నాం..

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం. తర్వాత జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

- నాగరాజారావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి

కొత్త ప్రభుత్వంలో ఇలా..

కొత్త ప్రభుత్వం నేతన్నలను గుర్తించే పనిలో పడింది. ఇందులో భాగంగా చేనేత సహకార సంఘాలకు తొలుత ఎన్నికలు నిర్వహించనుంది. ఒక్కో సొసైటీలో 50 మంది వరకు ఉండేలా దిశానిర్దేశం చేయనుంది. తద్వారా సొసైటీల సంఖ్య పెరిగి రాయితీ, రుణాలు సకాలంలో అందుతాయని భావిస్తోంది. 2014-2019 మధ్య ఎలాంటి లబ్ధి చేకూరిందో .. అదే స్థాయిలో పథకాలను ప్రవేశ పెట్టనున్నారు. వచ్చే నెల 21వ తేదీ లోపు గుర్తింపు పొందిన సొసైటీలు, నమోదు కానివి, నూతనంగా ఏర్పాటైన వాటి వివరాలను సేకరించ నున్నారు. నవంబరు 14న ప్రకటన రానుంది. డిసెంబరు 4న ఎన్నికలుంటాయి. అదే నెల 6న నూతన పాలకవర్గాలు ఏర్పడనున్నాయి.

చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా చేనేత జౌళిశాఖాధికారి నాగరాజారావు

మైలవరం, సెప్టెంబరు 16: మైలవరం టెక్స్‌టైల్ పార్కులో 118 ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మంగళవారం ఆఖరి రోజు అని... ఈ అవకాశాన్ని చేనేతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి నాగరాజారావు సోమవారం తెలిపారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఒక్కో ప్లాటుకు రూ.50 వేలను చొప్పున లబ్ధిదారులు చెల్లిం చాలని.. ఇప్పటివరకు 32 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 20వ తేదీ కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లోనే లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయిస్తారని తెలిపారు. హ్యాండ్ లూమ్, పవర్‌లూం, డ్రాయింగ్ తదితర యూనిట్లకు ప్లాట్లు కేటాయిం చిన అనంతరం బ్యాంక్ ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇతర వివరా లకు చేనేత జౌళి శాఖ ఏడీని సంప్రదించాలని ఆయన తెలిపారు.

కొలిమిట్టకు సరిహద్దు గండం

అటు పంచాయతీ ఇటు మున్సిపాలిటీ ● తాగునీటి కోసం నానా తంటాలు

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పైపులైన్లు ధ్వంసం ● పట్టించుకోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు



పనిచేయని నీటి పథకం బోరు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: కొలిమిట్టకు సరిహద్దు తాకడంతో తాగునీటి సమస్య మొదలైంది. జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో సగభాగం, పంచాయతీ పరిధిలో సగభాగం కొలిమిట్ట ఉండడంతో రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఫలితంగా అభివృద్ధి విషయంలో ఏ అధికారులూ పట్టించుకున్న పాపాన పోలేదు. కూలి పనులు చేసుకుంటున్నా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల పన్నులను చెల్లిస్తున్నా కొలిమిట్ట వాసులకు అధికారులు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనడంలో సందేహం లేదు. పగలంతా పనులు చేసుకుని రాత్రి ఇంటికి వచ్చే సమయానికి తాగు నీరు, అవసరాలకు నీరు దొరక్క అల్లాడుతున్నారు. నీటి సమస్యపై వైసీపీ ప్రభుత్వంలో కూడా పలుమార్లు కొలిమిట్టవాసులు ఇటు మున్సిపల్ అధికారులు, అటు పంచాయతీ వారికి సమస్యను విన్నవించినా అధికారులు ఎవరూ వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో నిత్యం నీటి కోసం యజ్ఞం చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే...

జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ చెన్నముక్కపల్లె పంచాయతీల సరిహద్దు ప్రాంతం కొలిమిట్ట వాసులు తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో ఆ ప్రాంతానికి వెళ్లే పైపులైన్ ధ్వంసం కావడంతో కొలిమిట్ట వాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సుమారు ఏడాదిగా సుమారు 500 కుటుంబాలకుపైగా కొలిమిట్ట వాసులు నీటికోసం అవస్థలు పడుతున్నా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అటు పంచాయతీలో ఇటు మున్సిపాలిటీలో ఉన్న కొలిమిట్ట ప్రాంతం రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. రాయచోటి నియోజకవర్గంలోని చుట్టుపక్కల మండలాలకు చెందిన ఎందరో పేదలు తమ పిల్లల చదువుకోసం గ్రామాలను వదిలి బతుకు దెరువు కోసం పట్టణానికి వచ్చి కూలీనాలీ చేసుకుంటూ అద్దె గృహాల్లో నివసిస్తూ చిన్న చిన్న రేకుల షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్న కొలిమిట్ట ప్రాంతీయులు నిత్యం సమస్యలతో సావాసం చేస్తున్నారు. అన్నిరకాల పన్నులను చెల్లిస్తున్నా కొలిమిట్ట వాసులకు అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనడంతో సందేహం లేదు. కొలిమిట్ట ప్రాంతంలో నివసించే చాలామంది తోపుడు బండ్ల వ్యాపారాలు, రైస్ మిల్లులు ఇతర దుకాణాల్లో రోజు వారీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాగునీటి సమస్యపై వైసీపీ ప్రభుత్వంలో కూడా పలుమార్లు కొలిమిట్ట వాసులు ఇటు మున్సిపల్, అటు గ్రామ పంచాయతీ వారికి సమస్యను విన్నవించినా అధికారులు ఎవరూ వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఈ ప్రాంత వాసులు వారి ప్రాంతంలో గతంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటూ అరకొర నీటితో అవసరాలను తీర్చుకుంటున్నారు.



తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గోడును వినిపిస్తున్న కొలిమిట్ట వాసులు

యూజీడీ పనులతో పైపులైన్ ధ్వంసం

వైసీపీ ప్రభుత్వంలో రాయచోటికి రూ.300 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణ ప్రజలకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఈ పనులను పొందిన కాంట్రాక్టర్లు రాయచోటి మున్సిపాలిటీలో కా కుండా మున్సిపాలిటీకి బయట పంచాయతీలు, నివాసాలు లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఈ క్రమంలోనే ఇటు మున్సిపాలిటీకి అటు చెన్నముక్కపల్లె పంచాయతీ సరిహద్దు ప్రాంతమైన కొలిమిట్ట ప్రాంతానికి పైపులైన్ వెళ్లే మార్గాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో ఆ ప్రాంతానికి వెళ్లే పైపులైన్ పనులు అక్కడక్కడా ధ్వంసం కావడంతో గతేడాదిగా నీటి సరఫరా జరగలేదు. దీంతో వారు చేతిపంపులు, ప్రైవేటు బోర్లు, నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తూ తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి మా ప్రాంతాన్ని మున్సిపాలిటీలోకి చేర్చి ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కొలిమిట్ట వాసులు కోరుతున్నారు.

పట్టించుకోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

సుమారు 500 కుటుంబాలకుపైగా నివసిస్తున్న కొలిమిట్ట ప్రాంతానికి రోళ్లమడుగు నీటి పథకం నుంచి గానీ అటు వెలిగల్లు నీటి పథకం నుంచి కానీ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని ఆ ప్రాంతీయులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోకపోయారు. దీంతో మూడు వేలకుపైగా జనాభా కలిగిన కొలిమిట్ట ప్రాంత వాసులు తాగునీటి ఇబ్బందులను నిరంతరం ఎదుర్కొంటూనే ఉన్నారు. దీనికి తోడు చెన్నముక్కపల్లె పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో ప్రజల తాగునీటి సౌకర్యం కోట్లాది రూపాయలు నిధులు మంజూరైనా పనులను పూర్తి చేయడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిలువెల్లా నిర్లక్ష్యం ప్రదర్శించడంతో నేడు ఆ ప్రాంత పేదలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి కొలిమిట్ట ప్రాంతంలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అటు వెలిగల్లు నీటి పథకం నుంచి గానీ ఇటు రోళ్లమడుగు నీటి పథకం నుంచి గానీ పూర్తి స్థాయిలో పైపులైన్ ఏర్పాటు చేసి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే రోళ్లమడుగు నీటి పథకం నుంచి కొలిమిట్ట ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన నీటి పథకం సంపు నిర్మాణంలో పనులు సకాలంలో పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తాగునీటిని అందించలేకపోతున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అంటున్నారు. కాంట్రాక్టర్లు సంపు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే చెన్నముక్కపల్లిలో చాలా వరకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు అంటున్నారు.

మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు



మా ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యపై పలుమార్లు ఇటు మున్సిపల్ అధికారులు అటు పంచాయతీ వారికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పగలంతా కూలి పనులు చేసుకుని జీవించే తాము నీటికోసం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అక్కడక్కడా చేతి పంపులు, బోర్ల ద్వారా వచ్చే నీరు పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. ఒక్కో దశలో నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని మా ప్రాంతానికి తాగునీటిని అందించి పుణ్యం కట్టుకోవాలి.

- మైమున్‌బీ, కొలిమిట్ట, రాయచోటి



అరకొర నీటిని అందిస్తున్న నీటి పథకం బోరు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం

చెన్నముక్కపల్లె పంచాయతీ కొలిమిట్ట తదితర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆ ప్రాంతంలో తాగునీటి బోర్ల ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నాం. రోళ్లమడుగు నీటి పథకానికి సంబంధించిన సంపు పూర్తయితే చాలా ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా నీటిని అందించేందుకు అవకాశాలున్నాయి. కొలిమిట్ట ప్రాంతంలో నీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే నీటి సమస్య లేకుండా చూస్తాం.

- ప్రదీప్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, రాయచోటి

మాకు ఎలాంటి సౌకర్యాలు లేవు



ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు అందడం లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు తాము అన్ని రకాల పనులను సకాలంలో చెల్లిస్తున్నాము. అయినా తాగునీటి సమస్య మమ్మల్ని వెంటాడుతోంది. తమ గోడును ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. బోర్ల ద్వారా చేతిపంపుల ద్వారా నీటిని తెచ్చుకుని అవసరాలను తీర్చుకుంటున్నాము. రాయచోటిలో ఉన్నా మాకు ఎలాంటి సౌకర్యాలు లేక పల్లె జీవనం లాగా ఉన్నాము. జిల్లా ఉన్నతాధికారులు సకాలంలో తాగునీటిని అందించి ఆదుకోవాలి. మా గ్రామాన్ని మున్సిపాలిటీ పరిదిలోకి మార్చాలి.

- మహబూబ్‌బాషా, కొలిమిట్ట, రాయచోటి

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థులు

● రాష్ట్రస్థాయిలో పతకాలు



బహుమతులు అందుకున్న తైక్వాండో క్రీడాకారులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16: 14,15 తేదీల్లో కడపలో టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో ఛాంపియన్‌షిప్ జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ల విభాగంలో ఎర్రగుంట్ల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ దినేష్ తెలిపారు. సినియర్ ఓపెన్ విభాగంలో ఎస్.అమానుల్లా, డి.సుజయ్‌షాలోం బంగారు పతకాలు సాధించారన్నారు. ఎస్.హసనైను వెండి, బాలికల విభాగంలో మహిత, రిషిత బంగారు, ఎం.గమన వెండి, ఎం.గగన కాంస్య పతకం, జూనియర్స్ విభాగంలో బాలసాయి సాత్విక్, చంద్ర కాంత్ బంగారు, పీఎస్ షామీర్ హుస్సేన్, ఎస్.యజ్ఞహిత్‌రెడ్డి వెండి పతకాన్ని సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో పి.రెడ్డి సాకేత్, సి.వెంకట సాయి తులసినాథ్, పి.యశ్వంత్, ఎం.కార్తీక్‌రెడ్డి బంగారు పతకాన్ని సాధించారన్నారు.

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలు నడపాలి

● అమెరికాలో కేంద్ర మంత్రి పెమ్మసానికి ఎన్ఆర్ఐ టీడీపీ నేత వినతి



కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానితో చర్చిస్తున్న బాలాజీ తాతినేని

సుండుపల్లె, సెప్టెంబరు16: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు నడపడానికి చర్యలు చేపట్టాలని అమెరికాలో టీడీపీ సీనియర్ నేత తాతినేని శివకుమార్ నాయుడు సోదరుడు ఎన్ఆర్ఐ టీడీపీ కమిటీ ప్రతినిధి బాలాజీ, తాతినేని విన్నవించారు. అమెరికాకు వెళ్లిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానితో అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల వాసి బాలాజీ తాతినేని మాట్లాడుతూ అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాల నుంచి వేలాది మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారన్నారు. గల్ఫ్ దేశాలనుంచి సొంత ప్రాంతాలకు వచ్చి పోవడానికి తమిళనాడులోని చెన్నై, కర్ణాటకలోని బెంగుళూరులోని విమానాశ్రయాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధిక ఖర్చులతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి కృషి చేయాలని కోరారు. ఎంతో కాలంగా అభివృద్ధిని నోచుకోని అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చడానికి సహకారం అందించాలని కోరారు. టీ. సుండుపల్లె మండలంలో టెలీ కమ్యూనికేషన్, ఇంటర్ నెట్ సౌకర్యాలు సక్రమమైన అందుబాటులో లేవని మండలంలో బీఎస్ఎన్ఎల్ అదనపు టవర్లు, భారత నెట్ 5జీ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అన్నమ య్య జిల్లా పీలేరులో లయన్స్‌క్లబ్ హాస్పిటల్ నిర్మాణం, టీ. సుండుపల్లె ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించగా పూర్తి వివరాలతో సమాచా రం ఇవ్వాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చెయ్యి



ధనుష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 16: రైల్వేకేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రైలు కిందపడి యువకుడి చెయ్యి తెగిపడిపోయిన సంఘటన చోటు చేసుకుంది. గుంతకల్ వాసి కురుబ ధనుష్ పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. కాలేజీకి వెళ్లేందుకు గుంతకల్ నుంచి 12163 ఎక్స్‌ప్రెస్‌లో పుత్తూరుకు వెళుతుండగా రైలు నిలబడడంతో అతడు దిగి కదులుతున్న రైతులను మళ్లీ ఎక్కబోతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. దీంతో అతడి చెయ్యి పూర్తిగా తెగిపడిపోయింది. వెంటనే ఆర్పీఎఫ్ జీఆర్‌పీ సిబ్బంది క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏఐటీయూసీది ఉజ్వల పోరాటాల చరిత్ర

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 16: ఏఐటీయూసీది దేశ చరిత్రలో ఉజ్వల పోరాటాల వారసత్వమని రాష్ట్ర అధ్యక్షుడు రావుల పల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో స్కీం వర్కర్ల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు రెండో రోజు ముగిశాయి. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐటియూసీ రాష్ట్ర నేతలు లలితమ్మ, మంజుల రమేష్ బాబు, స్రవంతి సుబాషిని, బాలక్రిష్ణ, శాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసు బ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులు దగ్ధం

కడప (క్రైం), సెప్టెంబరు 16: కడప నగరం బీకేఎం స్ట్రీట్‌లోని అమ్మవారిశా ల వెనుక సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి తెలిపారు. జాషు, కిసాన్ దంపతులు ఇంట్లో ఉండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని సామగ్రి, జీడిపప్పు, బాదంపప్పు, బిర్యాని ఆకు కాలిపోయినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంటలను అదుపులోకి తెచ్చామని, బాధితుల ఫిర్యాదుపై దాదాపు రూ.50వేల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

హత్య చేశారంటూ బంధువుల ఆరోపణ ● నడిరోడ్డుపై రాస్తారోకో





చెట్టుకు వెలాడుతున్న రమేశ్ మృతదేహం నడిరోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మృతుని బంధువులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16: పెట్రోలు బంకులో పనిచేసే లక్కినేని రమేశ్ (38) ఆర్అండ్‌బీ కార్యాలయం ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకోలేదని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని బంధువులు ఆరోపిస్తూ నడిరోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎస్ఐ కొండారెడ్డి, సీఐ శ్రీనివాసులు వారిని శాంతిపజేసేందుకు ప్రయత్నించినా డీఎస్పీ వచ్చే వరకు రాస్తారోకో కొనసాగిస్తామంటూ డిమాండ్ చేశారు. చివరికి సీఐ హామీతో వారు రాస్తారోకో విరమించారు. వివరాలిలా.. స్థానిక మైదుకూరు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకులో ఈదుళ్లపల్లె వాసి లక్కినేని రమేశ్ పంప్ ఆపరేటరుగా పనిచేస్తున్నాడు. పెట్రోలు బంకు పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయం ఆవరణలో సోమవారం తెల్లవారు జామున వేపచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అతను చెట్టుకు వేలాడడం చూసిన మరో యువకుడు పోలీసులకు సమాచారం తెలిపారు. ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి మృత దేహాన్ని పరిశీలించి విషయం సీఐ శ్రీనివాస్‌కు తెలియజేశారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈసమయంలో రమేశ్ ఆత్మహత్య చేసుకోలేదని ఎవరో హత్య చేశారని మృతుని కుటుంబసభ్యులు ఆరోపించారు. హత్య కేసుగా నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై రాస్తారోకో చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకో విరమించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరినా వారు శాంతించలేదు, పెట్రోలుబంకు యాజమాన్యాన్ని కూడా విచారించాలని రమేశ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డీఎస్పీ సంఘటనా స్థలానికి వచ్చి కారకులపై చర్యలు తీసుకోవాలని హామీ ఇవ్వాలని అంతవరకు రాస్తారోకో విరమించేది లేదని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కొనసాగించారు. దీంతో టీడీపీ నేత కొండా రామక్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని ఒప్పించడం, సీఐ మృతుని బంధువులకు హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం కోసం వారు అంగీకరించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరవాత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పంచనామా పూర్తి కాకపోవడంతో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రామాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

గ్రామంలో ఇసుకలోడు ట్రాక్టర్లు పట్టివేత

ఎమ్మెల్యే వర్గీయుల మంటూ హూంకరింపు



ఇసుకలోడు ట్రాక్టరును పరిశీలిస్తున్న రూరల్ పోలీసులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 16: పొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా సాగించిన తరహాలో నేడు టీడీపీ ఎమ్మెల్యే వర్గీయులు కొందరు ఇసుక అక్రమ రవాణాను నడిపిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ ఇసుక అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం, పేకాటను ఉపేక్షించేది లేదని బహిరంగ ప్రకటన చేసినా ఆయన హెచ్చరికలను ఖాతరు చేయకుండా ఇసుక మాఫియా రామాపురం కేంద్రంగా అక్రమ రవాణా సాగిస్తోంది. ప్రొద్దుటూరులో డీఎస్పీ సహా అన్ని స్టేషన్ల సీఐలు ఎస్ఐలు మారినా ఇసుక అక్రమ రవాణా తీరులో ఏమాత్రం మార్పులేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగా వచ్చిన పోలీసులకు సమాచారం అంది ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే చర్యలకు దిగితే తాము ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులమంటూ పోలీసులను సైతం బెదిరిస్తున్నట్లు సమాచారం. సోమవారం రామాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారంతో పోలీసులు పెట్రోలింగ్ వెళ్లే సరికి ఇసుక లోడు ట్రాక్టర్లను నేరుగా రామాపురంలోని తమ ఇళ్లవద్ద వుంచారు. ఇసుకలోడుతో వున్న నాలుగు ట్రాక్టర్లను రూరల్ పోలీసు స్టేషనుకు తీసుకురావాలని పోలీసులు ఆదేశించారు. అయితే ఇసుకను డంపుల్లో అన్‌లోడ్ చేసి ఖాళీ ట్రాక్టర్లను వుంచుకున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తన వర్గీయులైనా సరే ఇసుక అక్రమరవాణాకు పాల్పడితే చర్యలు తీసుకోమని ఆయన బహిరంగ ప్రకటన చేశారు. దీంతో పోలీసులు కూడా టీడీపీ నేతలవని ఎక్కడా ఇసుక ట్రాక్టర్లను పట్టుకోకుండా వదిలిన దాఖలాలు పెద్దగా లేవు. కానీ సోమవారం రామాపురంలో ఇసుకలోడుతో వున్న ట్రాక్టర్లు పట్టుకుని వాటిని పరిశీలించి, విచారించి స్టేషనుకుతీసుకు రమ్మన్నా పోలీసుల మాటలను ఖాతరు చేయకుండా ఇసుకను డంపుల్లో అన్‌లోడు చేసి ట్రాక్టర్లను ఖాళీగా వుంచుకోవడంతో పోలీసులు ఖంగుతిన్నారు. దీనిపై రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీని వివరణ కోరగా సీఐ సహా మేమంతా మరో డ్యూటీలోవున్నాం. మా పోలీసులు పెట్రోలింగ్ వెళితే ఇంటివద్ద లోడుతో ట్రాక్టర్లు పెట్టుకున్నారు. వాటిని స్టేషనుకు తీసుకురమ్మని చెప్పివచ్చారు. వారంతా మా నోటీసులో వున్నారు. వారిపై చర్యలు ఎలా తీసుకోవాలో తీసుకుంటామని తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు

రెండున్నర కిలోలు స్వాధీనం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16: గంజాయి అమ్ముతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ రంపాడు రోడ్డులో గంజాయి అమ్ముతున్న ఆసిఫ్, వెంకటయ్య, మహ్మద్ గౌస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు కడప విద్యార్థినులు




కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 16: వేంపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో అండర్-19 బాస్కెట్ బాల్ రాష్ట్ర పోటీలకు యశస్విని, రిజ్వానా ఎంపికైనట్లు గాయత్రి జూనియర్ కళాశాల ఫౌండర్ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. వీరు అక్టోబర్‌లో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా జట్టు తరపున పాల్గొననున్నట్లు వెల్లడించారు.

కుక్కల దాడి బాలుడికి గాయాలు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 16: సర్వాయపల్లె రోడ్డులో సోమవారం కుక్కలు వెంటపడడంతో బాలుడు గాయపడ్డాడు. కుక్కలు వెంటపడడంతో బాలుడు పరిగెత్తినా ఒక కుక్క వెంబడించి కరిచింది. పరిగెత్తడంతో బాలుడు కింద పడి నోట్లోని పండ్లు విరిగిపోయాయని తల్లిదండ్రులు వాపోయారు.

టైలింగ్ పాండ్ నిర్వహణలో యూసీఐఎల్ నిర్లక్ష్యం

వేముల, సెప్టెంబరు 16: వేముల మండలం ఎం.తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం సంస్థ నుంచి వెలువడే వ్యర్థాలను నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన టైలింగ్ పాండ్ నిర్వహణలో యూసీఐఎల్ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోందని కేకేకొట్టాల గ్రామస్తులు వాపోతున్నారు. ఆరు నెలల్లో రెండోసారి ఈ టైలింగ్ పైపులు లీకేజీ అయ్యాయి. యురేనియం వ్యర్థాలు పంట పొలాల్లోకి వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కేకే కొట్టాల గ్రామం సమీపంలో పైపులు లీకేజీ కావడంతో యురేనియం వ్యర్థాలు రైతుల పొలాల్లోకి లీక్ అయ్యాయి. గ్రామస్తులు విషయాన్ని యురేనియం అధికారులకు తెలిపారు. వారు మరమ్మతులు చేయడానికి రాగా.. అధికారులను స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. 2009 నుంచి తమ సమస్యలకు పరిష్కారం చూపకుండా నిత్యం ఇలా వ్యర్థ పదార్థాలను వదిలేస్తూ తమ ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని అధికారులను నిలదీశారు. దీంతో ఉదయం సంస్థ అధికారులు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్థానిక రైతులతో సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సమస్య ఇప్పటిది కాదని, యురేనియం అధికారులకు అనేకమార్లు తెలిపినా చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఆరేళ్ల కిందట అప్పటి యురేనియం సంస్థ సీఎండీ అన్సారి కూడా ఈ టైలింగ్ పాండ్ వ్యర్థాలతో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చారని డీఎస్పీకి వివరించారు. సంస్థ నిర్వాకంతో సారవంతమైన భూములు బీడు భూములుగా మారాయని, రేడియేషన్ వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని, సంస్థ వారు తమ భూములు కొనుగోలు చేసి నష్టపరిహారం అందిస్తే ఊరు వదిలి వెళ్లిపోతామని ధర్నాలు చేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి రైతులు వెనుదిరిగారు.



ఘనంగా గణనాథుల ఊరేగింపు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 16: మండల పరిధిలో తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న గణనాథులను సోమవారం డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. నందిమండలం గ్రామంలోని చౌడమ్మ వీధిలో వినాయకుడి లడ్డూను వేలంపాట నిర్వహించగా ఒక లక్ష వెయ్యి రూపాయలకు అదే గ్రామానికి చెందిన డీలర్ పంగా చంద్రశేఖర్ దక్కించుకున్నారు. కాగా అక్కడే వినాయకుడి డాలర్‌కు వేలం పాట నిర్వహించగా ముస్లిం సోదరుడు మస్తాన్ అనే వ్యక్తి రూ.20వేలకు డాలర్‌ను దక్కించుకున్నారు.


లడ్డూను దక్కించుకున్న పంగా చంద్రశేఖర్

శేషయ్యగారిపల్లెలో తాగునీటి పైపులైను ఏర్పాటు

చెన్నూరు, సెప్టెంబరు 16 : మండలంలోని శేషయ్యగారిపల్లెలో నాలుగు రోజుల క్రితం ఎక్సకవేటరుతో తొలగించిన పైపులైను పునరుద్ధరించారు. కొప్పర్తి పరిశ్రమకు పెన్నానది నుంచి తాగునీటి పైపులైను ఏర్పాటు చేస్తున్నారని, ఈ పైపులైను మండలంలోని శేషయ్యగారిపల్లె గుండా హైవే రహదారి పక్క నుంచి వెళుతోందని, అయితే పైపులైను గుంతల కోసం ఎక్సకవేటరుతో తొలగించడం జరిగింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతిలో రావడంతో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిస్పందించి ఎక్సకటేరుతో పైపులలైను తొలగింపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తాగునీటి పైపులైను పనులు తిరిగి పునరుద్ధరించి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అంతేకాక గ్రామప్రజలకు పైపులైను పనులు పూర్తి చేసేంత వరకు కొప్పర్తి పరిశ్రమ కోసం ఎలాంటి పనులు చేయరాదన్నారు. ఎమ్మెల్యే ఆదేశించడంతో సోమవారం ఉదయం కల్లా పైపులైను పనులు పూర్తి చేసి తిరిగి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేయడంతో ఆ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


శేషయ్యగారిపల్లెలో తొలగించిన పైపులైన్లను తిరిగి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అన్నదానం మహాపుణ్య కార్యక్రమం

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 16 : అన్నదానం మహా పుణ్యకార్యక్రమమని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి తెలిపారు. సోమవారం ఈద్ ఈ మిలాదున్‌నబీ మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా కడప నగరం 28వ డివిజన్‌లోని బండ్లమిట్ట నందు టీడీపీ కార్యకర్త షామీర్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా తదితరులు పాల్గొన్నారు.





నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు, సెప్టెంబరు 16 : నేడు మంగళవారం వల్లూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక సమావేశానికి హాజరు కావాలని వారు తెలిపారు. ఉదయం 10గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తామని, కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

వేంపల్లె, సెప్టెంబరు 16 : ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్డు పంపిణీ చేశారు. సోమవారం సత్యకుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి రోగులకు పండ్లు బ్రెడ్డు పంపిణీ చేశారు.

ఆసుపత్రుల అభివృద్ధికి మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముందు కెళుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, వేమకుమార్, బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, దొంతు సుమన్, జిల్లా కార్యవర్గసభ్యులు సునీల్‌కుమార్, మల్లిఖార్జున, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.





ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడిగా రవిశంకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16 : రెవెల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) జాతీయ అధ్యక్షుడిగా రవిశంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో జరిగిన ఆర్ఎస్‌యూ జాతీయ మహాసభల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలకు చెందిన ఆర్ఎస్‌యూ నేతలు జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఐదుగురు జాతీయ కార్యవర్గసభ్యులుగా కూడా ఎంపికయ్యారు. తెలంగాణకు చెందిన బీమరాజు, కర్ణాటకు చెందిన సురేశ్‌బాబు, ఏపీకి చెందిన శ్రీధర్, క్రిష్ణారెడ్డి, ప్రశాంత్‌లు జాతీయ కార్యవర్గసభ్యులుగా ఎంపికయ్యా రు.ఈ సందర్భంగా రవిశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్నారు.


మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

'వైవీయూ అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలి'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 16: యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2019 నుంచి 2024 వరకు జరిగిన బోధనేతర సిబ్బంది అక్రమ నియామకాలపై విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, అలాగే విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నాయకులు దేవా రాహుల్, నాగార్జున, సంజీవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గంగా సురేష్

జనాభాకు అనుగుణంగా దళితుల రిజర్వేషన్లు పెంచాలి

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 16: పెరిగిన దళితుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంగా ఇటీవల ఏడుగురు జడ్జిలతో కూడిన కమిటీ ఇచ్చినతీర్పు సరైందికాదన్నారు. ఆ తీర్పును పునఃపరిశీలించాలన్నారు. రాయలసీమ మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ఇన్‌చార్జ్ మిట్లా సునీతకుమారి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.గోపాల్, రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

నేటి నుంచి పులివెందులలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 16 : నేడు మంగళవారం నుండి అక్టోబరు 1 వరకు పులివెందుల పురపాలక సంఘం నందు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు స్వచ్ఛతా హి సేవాలో భాగంగా స్వచ్ఛతకి బాగిదారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమాలు ఉంటాయని, అందులోభాగంగా శ్రీరంగనాథ స్వామి దేవాలయం, బ్రాహ్మణపల్లె రోడ్డు దగ్గర దేవాలయ ప్రాంగణం నందు మానవహారం, మాస్ క్లీనింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు.

18న అన్నక్యాంటీన్ ప్రారంభం

పులివెందుల పురపాలక సంఘంలో ఈ నెల 18న ఉదయం 7గంటలకు గాంధీ సర్కిల్, నాలుగురోడ్ల కూడలి దగ్గర అన్నక్యాంటిన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణంలోని ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా అందరూ పాల్గొనాలని కోరారు.

గణేష్ ఉత్సవాల దిగ్విజయం పట్ల హర్షం

● ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నాయకులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 16: వినాయక చవితి పర్వదినం నుండి బొజ్జ గణపయ్యల నిమజ్జనం వరకూ జిల్లాలో గణేష్ ఉత్సవాలు దిగ్విజయం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య గౌరవాధ్యక్షులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణశర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ హర్షం వెలిబుచ్చారు. సోమవారం స్థానిక బ్రాహ్మణవీధిలో గల సమాఖ్య జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత తొమ్మిది రోజులుగా గణేష్ ఉత్సవాలు విజయవంతంగా పూర్తి కావడానికి దోహదపడిన కలెక్టర్ శివశంకర్‌కు, అలాగే ఎస్పీ హర్షవర్ధన్ రాజు ధన్యవాదాలు తెలిపారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 16 :కడప నగరంలోని మరియాపురంలో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు స్టేడియంలో ఫస్ట్ ఓపెన్ స్టేట్ తైక్వాండో చాంపియన్ షిప్ డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని 2 గోల్డ్, 1 సిల్వర్, 1 బ్రాంజ్ గెలుచుకున్నారు.వారిలో 6వతరగతికి చెందిన షేక్ఇబ్రహీం, సయ్యద్ ఇబ్రహీం ఖలీలుల్లా, 3వ తరగతి చెందిన ఖాలిద్, 6వతరగతికి చెందిన సీఎస్ ఇసాక్ సాధించారని పేర్కొన్నారు.

సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో తొలగించిన చిత్రపటాలను ఏర్పాటు చేయాలి: జానమద్ది

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16 : సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన గ్రంథాలయంలో తొలగించిన చిత్రపటాలు తిరిగి ఏర్పాటు చేయాలని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే జిల్లాలోని గ్రంథాలయ అభిమానుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇటీవల ఎన్నికల తరువాత ఉన్నపళంగా ప్రొఫెసర్ కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటాన్ని తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై బ్రౌన్ గ్రంథాలయ సలహా సభ్యుల హోదాలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రారు గ్రంథాలయ సంచాలకులను ప్రశ్నించినా ఎటువంటి స్పందన లేదన్నారు. గ్రంథాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటాన్ని, కలెక్టర్ హరికిరణ్ చిత్రపటాన్ని కూడా తొలగించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. తొలగించిన చిత్రపటాలను యథావిధిగా కొనసాగించాలన్నారు.

ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్‌కు ఘన స్వాగతం

చెన్నూరు, సెప్టెంబరు 16 : ఏలూరు పార్లమెంటు సభ్యుడిగా విజయం సాధించి తొలిసారిగా స్వగ్రామమైన మైదుకూరుకు వస్తున్న పుట్టా మహేశ్‌యాదవ్‌కు చెన్నూరులో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కడప విమానాశ్రయం నుంచి సోమవారం సాయంత్రం చెన్నూరు మీదుగా వస్తున్న ఆయనకు స్థానిక టీడీపీ జిల్లా మాజీ ధికార ప్రతినిధి ఇందిరెడ్డి శివారెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు కుందేటి తిరుపతిబాబు, అతికారి విశ్వం, జడ లక్ష్మీనారాయణ, కొండపట సుధాకర్‌రెడ్డి, కొక్కిరాయపల్లె సుధాకర్‌రెడ్డి, కొండాల చెన్నయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య ఘన స్వాగతం పలికారు.


పుట్టా మహేశ్‌యాదవ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

ఘనంగా మిలాద్- ఉన్ - నబీ వేడుకలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 16: కమలాపురంలో వెలసిన దర్గా ఏ గఫారియా దర్గా ఆవరణంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు (మిలదున్‌నబీ) ఘనంగా నిర్వహించారు. పెద్దదర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సీకేదిన్నెలో...

చింతకొమ్మదిన్నె మండలంలో మిలాదున్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మిలాదున్‌నబీని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు.

ఘనంగా దేవుని కడపలో నిత్యహోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 16: దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా రెండవ రోజైన సోమవారం సాయంత్రం ఘనంగా నిత్యహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్, సాయికృష్ణ, తరుణ్, వేదమంత్రాలను జపిస్తూ హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి చతుష్టానార్చన, ద్వారాతోరణం, అనంతకాలపూజ, అగ్నిప్రతిష్ట, పవిత్ర ప్రతిష్ట తదితర కార్యక్రమాలను మంగళకరంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవునికడప దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పలువురు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 16:వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె గ్రామ సమీప పొలాల్లో జూదమాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారంతో దాడులు చేయగా 11 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16270 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేతన్న నేస్తం ద్వారా రుణాలు ఇవ్వాలి

వేంపల్లె, సెప్టెంబరు 16:రాష్ట్రంలో పేదరికంలో ఉన్న చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా రుణాలు ఇవ్వాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లిఖార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 30న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని కలెక్టరు కార్యాలయాల ఎదుట జరిగే ధర్నా విజయవంతం చేయాలని వేంపల్లెలో కరపత్రాలను విడుదల చేశారు. చేనేత కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవలని నిర్లక్ష్యం చేస్తే అందరినీ కలుపుకుని ఉద్యమబాట పడతామని అవ్వారు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు రామచంద్ర, డాక్టర్ సుబ్రమణ్యం, కమలాపురం అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.















రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 16: స్థానిక నాగార్జున ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. కొప్పర్తి సమీపంలోని ఎయిల్ డిక్సన్ టెక్నాలజీ కంపెనీలో సీసీ కెమెరాల తయారీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం జాబ్‌మేళా బుధవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులని 19 నుంచి 32 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, మార్కులిస్టు, బ్యాంకు అంకౌంట్ జిరాక్స్ కాపీ, పాన్‌కార్డు, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9515437935 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 16 : నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు మంగళవారం నుంచి మండలంలోని అన్ని పంచాయతీలలో జరుగుతాయని ఎంపీడీఓ లక్ష్మీదేవి విలేకరుల సమావేశంలో తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలోని అన్నలూరు, డాంకాన్‌పల్లె,శివపురం, నంద్యాలంపేట,తువ్వపల్లె,ఎన్ ఎర్రబల్లె, విశ్వనాథపురం,వనిపెంట,గంజికుంట, మిట్టమానుపల్లె,పప్పనపల్లె,ఆదిరెడ్డిపల్లె,తిప్పిరెడ్డిపల్లె పంచాయతీలలో రోజుకు ఒక పంచాయతీలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన అధికారులందరూ పాల్గొనాలన్నిప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

గోపవరం..: నేటి నుంచి అక్టోబరు 1వరకు మండల పరిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్ర మాన్ని నిర్వహిస్తామని గోపవరం ఎంపీడీవో రామక్రిష్ణయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్రతి అధికారి కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలు ఆయా గ్రామ సచివాలయాల్లో వెల్లడించామన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించా లన్నారు. మంగళవారం ఉదయం పెద్దగోపవరం ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

వీల్‌చైర్ అందజేత

కాశినాయన, సెప్టెంబరు16: నాయనిపల్లెకు చెందిన వెంకటప్రసాద్ సుజన కుమారుడు కొప్పరపు జశ్వంత్ కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేక మంచానికే పరిమితమయ్యాడు. కాగా విషయాన్ని గ్రహించిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి సోమవారం జశ్వంత్‌కు వీల్‌చైర్‌ను అందజేశారు.



ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు





ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో మిలాద్-ఉన్-నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 16: మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఉదయం మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా మైదుకూరు రోడ్డులోని నజీరుల్లాషా మఠ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పుట్టపర్తి సర్కిల్, గంగమ్మ దేవాలయం వీధి, గాంధీరోడ్డు మీదుగా సుందరాచార్యుల వీధిలోని అషారేషరీఫ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాష, ప్రధాన కార్యదర్శి ఇలియాస్, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు ఖలీల్, కౌన్సిలర్లు గౌస్, కమాల్‌బాష, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో మిలాద్ ఉన్ నబీ పండుగ భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గౌషియా మకాన్ పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ ఆయన కుమారుడు తాహీర్‌పీరాఖాద్రీ పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుకున్నారు. అలాగే పలగాడి సెంటర్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు పీఠాధిపతి సాదిక్‌పాషా ఖాద్రీ శిష్య బృందం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం గౌషియా మకాన్, జామియా మసీదు ప్రాంగణంలో మహ్మద్ ప్రవక్త జ్ఞాపికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కమిటీవారు, పోలీసులు పాల్గొన్నారు.

కొండాపురం..: పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించా రు. మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు కావడంతో మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని ముస్లింలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

కలసపాడు..: మండల కేంద్రమైన కలసపాడు, ఎగువ రామాపురం, ఎగువతంబళ్లపల్లె గ్రామాల్లో సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ముస్లింలు గ్రామ వీధుల్లో వెళ్లి మసీదుల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

పోరుమామిళ్ల..: భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ముస్లింలు మహ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వరద బాధితులకు విరాళం



కొండాపురం, సెప్టెంబరు 16: మండ లంలోని సీపీ ఐ, ఏఐటీ యూసీ తరపు న విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. మండలంలో పలు చోట్ల తిరిగి రూ.15,070 సేకరించినట్లు సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు.ఈ మొత్తాన్ని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డికి సోమవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధానకార్యదర్శి వెంకటరమణ, అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు బహదూర్ షావలి, ప్రసాద్,మోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 16: జమ్మలమడుగు పట్టణంలో సోమవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు రామన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు వై.చిన్నయ్య, మేకల ఆంజనేయులు, కొండయ్య, బాల ఓబయ్య, సి.ఓబులేసు, చంద్రకుమార్, పుల్లయ్య, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పుట్టా మహేశ్‌కు జననీరాజనాలు




ఖాజీపేట టోల్ గేటు వద్ద ఎంపీ పుట్టా మహేశ్‌కు పూల వర్షం కురిపిస్తున్న టీడీపీ నాయకులు, మైదుకూరులోని రాయల్ కూడలి వద్ద పుట్టా మహేష్

ఖాజీపేట, సెప్టెంబరు 16: చెన్నూరు బ్రిడ్జి మొదలుకుని ఖాజీపేట మండలం చివరి వరకు ప్రతి పల్లె వద్ద ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌కు ఘనస్వాగతం పలికారు. సోమవారం తొలిసారిగా ఖాజీపేటకు వస్తున్న ఎంపీకి కొండారెడ్డి హోటల్ వద్ద గజమాల వేసి టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి స్వాగతం పలికారు. చెన్నముక్కపల్లె వద్ద, కొత్తపేట వద్ద క్రేన్‌తో భారీగా గజమాలతో స్వాగతం పలుకగా టోల్ గేటు వద్ద పాటిమీదపల్లె వద్ద ఘనస్వాగతం పలికారు. త్రిపురవరం హరినాథ్‌రెడ్డి టోల్‌గేటు పై నుంచి పూల వర్షం కురిపించారు. ఖాజీపేట బైపాస్‌లో ముస్లింలు గజమాల వేసి స్వాగతం పలుకగా పత్తూరు పీడబ్ల్యూడీ బంగ్లా కోటంగురాయుపల్లె వద్ద గజమాలతో గ్రామస్థులు స్వాగతం పలికారు. బస్టాండు కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకుడు కేక్ కట్ చేయించి అందరికి పంచిపెట్టారు. సిద్ధాంతిపురం, బుడ్డాయపల్లె వద్ద గ్రామస్థులు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఇలా ప్రతి గ్రామం వద్ద అధిక సంఖ్యలో పాల్గొడంతో కాన్వాయ్ ముందుకు సాగలేదు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతులు ఇచ్చారు.కాగా కోటంగురాయుపల్లె వద్దగల కదిరియా టీ అంగడిలో ఎంపీ మహేష్ యాదవ్ టీ తాగారు. అంతేగాక చెన్నూరు బ్రిడ్జీ వద్ద నుంచి భారీ టపాసులు పేల్చారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కుమారుడు,ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మైదుకూరు పర్యటనలో భాగంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,మేధా కళాశాల ఛైర్మన్ నరసింహులు భారీ గజమాల వేసి ఆహ్వానం పలికారు.యాపరాల చిన్న,బురుగోళ్ల చిన్న బైక్ ర్యాలీ నిర్వహించారు.దారివెంబడి బాణసంచా,పూల జల్లులతో మైదుకూరు మారుమ్రోగింది.రాయల్ కూడలి వద్ద శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి మహేష్ పూలమాల వేశారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ రవీంద్ర,ధనపాల జగన్‌మోహన్,మేకల బాబు,దాసరి చిన్న బాబు పాల్గొన్నారు.

చాపాడు..: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు ప్రజలు సోమవారం రాత్రి విశ్వనాథపురం, భద్రిపల్లె, కేతవరం, చాపాడు, పల్లవోలు, ఖాదర్‌పల్లె, నాగులపల్లె గ్రామాల మీదుగా ఊరేగింపు జరిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ఆయనపై పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వీరనారాయణ, అక్బర్‌సలీం, బయపురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, హేమారెడ్డి, తదితరులు స్వాగతం పలికారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడుపుతాం

బద్వేలు, సెప్టెంబరు16: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిక్షణకు కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ, జనసేన నిలదీయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నానాటికీ ధ్వంసం చేస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను కావాలనే నష్టాల్లోకి నెట్టి ఆదాని, అంబాని వంటి కార్పొరేట్ శక్తుల చేతులలో పెట్టేలా కుట్రలు పన్నుతోందన్నారు. మోదీ ప్రభుత్వాన్ని నిలదీసి ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆదిల్, సీఐటీయూ నాయకులు రాయప్ప, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ గురువు హనుమంతరావు'



హనుమంతరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బద్వేలు, సెప్టెంబరు16: విద్యను బోధించిన గురువులలో ఉత్తముడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కొనియాడారు. హనుమంతరావు మాకు విద్యతో పాటు వినయం, నైతిక విలువలు, దేశభక్తి , సేవా భావం నేర్పారన్నారు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన హనుమంతరావు జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో భూమికి సారం

కలసపాడు, సెప్టెంబరు 16 : ఘనజీవామృతంతో భూమి సారవంతంగా ఏర్పడుతుందని ప్రకృతి వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువరామాపురంలో ఘన జీవామృత తయారీ విధానాన్ని రైతులచే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఘన జీవామృతం పేడ, ఆవుమూత్రం, శనగపిండి తదితర పదార్థాలతో కలిపి ఆరబెట్టి తరువాత ఎకరాకు 400 కేజీలు చల్లినట్లయితే భూసారం పెరిగి భూమి గుల్లబారుతుందని తెలిపారు. దీని ద్వారా పంటకు పాస్ఫేట్, యూరియా వేయాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, ప్రత్యూష, రాజశేఖర్‌రెడ్డి, రామకోటి,అంకిరెడ్డి, పెద్దయ్య, లక్ష్మీరాధ, హుసేన్‌బీ, రైతు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 16: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణార్థం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. అగస్త్యేశ్వర స్వామికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 16: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోంది. గండికోట జలాశయం నుంచి సోమవారం 7500 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉండగా పెన్నాకు 3,300 వేల క్యూసెక్కులు, ఉత్తరకాల్వకు 80 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 90 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని మైలవరం జలాశయ డీఈఈ నరసింహ మూర్తి తెలిపారు. గండికోట నుంచి మైలవరానికి మరింత నీరు ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి నీటి విడుదల మరింత పెంచుతామని పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.4 టీఎంసీల నీరు నిల్వ ఉందని డీఈఈ తెలిపారు.



పెన్నానదిలో కోతకు గురైన రోడ్లు

● రాకపోకలు బంద్




జమ్మలమడుగు పెన్నానదిలో కోతకు గురైన రోడ్డు, పెన్నానదిలో గుంతలు పడిన రోడ్డు

జమ్మలమడుగు, సెప్టెంబరు 16: జమ్మలమడుగు మండలంలోని పెన్నానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని మిఠాయిగిరి హైస్కూలు వద్ద నుంచి పెన్నానది గుండా వేపరాలకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. పెన్నానదిలో ప్రవాహం పెరిగింది. మరికొన్ని చోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడైనా ఆ గుంతల వద్ద రోడ్డు కోతకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరు గ్రామాల మధ్య పెన్నానదిలో ఉదయం రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారి అప్పుడో ఇప్పుడో కోతకు గురవుతుందని ఆ ప్రాంత వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతూ వెళ్లారు. కాగా ఉన్నట్లుండి మధ్యాహ్నం రోడ్డు కోతకు గురికావడంతో పెద్దదండ్లూరు గ్రామ చుట్టుపక్కల ప్రజలకు సుగుమంచిపల్లె మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లే దారి రోడ్డు పెన్నానదిలో కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు చాలా మంది తెలియక ప్రొద్దుటూరు, ఇతర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు జమ్మలమడుగులోని మిఠాయిగిరి హైస్కూలు వద్ద నుంచి వేపరాల మీదుగా మైలవరం గురప్పస్వామికి వెళ్లేవారు వచ్చి వెనక్కి పోతూ చాలా ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా పెద్దదండ్లూరు గ్రామ ప్రజలు ప్రొద్దుటూరుకు వెళ్లినవారు సుగుమంచిపల్లె వద్దకు వచ్చి రోడ్డు తెగిపోవడంతో వెనక్కు వెళ్లి జమ్మలమడుగు మీదుగా ముద్దనూరు రోడ్డు, సున్నపురాళ్లపల్లె, కన్యతీర్థం మీదుగా పెద్దదండ్లూరు గ్రామానికి వెళుతున్నారు. ప్రజలు గమనించి పెన్నానదిలో కోతకు గురైన రోడ్లకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి సమయాల్లో పెన్నానది పరిసర ప్రాంతాల్లో ఎవరూ వెళ్లకుండా పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పి.సుగుమంచిపల్లె-పెద్దదండ్లూరు మధ్య పెన్నానదిలో ప్రమాదకరంగా రోడ్డు



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాపాడు, సెప్టెంబరు 16: మండలంలోని విశ్వనాథపురం గ్రామం వద్ద ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్(36) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన సతీష్ మైదుకూరు నుంచి తన ఇంటికి ద్వి చక్రవాహనంపై వెళుతుండగా డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అతడి తలకు బలమైన గాయం తలగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వ్యక్తికి తీవ్రగాయాలు..: కర్నూలు కడప జాతీయరహదారిలోని ద్వారకానగర్ వద్ద రాత్రి 9గంటల ప్రాంతంలో దువ్వూరు మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడం తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన మైదుకూరునుంచి గొల్లపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చాపాడు పోలీసులు తెలిపారు.

గండికోటకు ఇన్‌ఫ్లో తగ్గింపు

కొండాపురం, సెప్టెంబరు 16: జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా గండికోట ప్రాజెక్టుకు వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 5000 క్యూసెక్కులకు తగ్గించినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇదివరకు సరాసరి రోజుకు 10,000 క్యూసెక్కులు వస్తుండగా దానిని 5,000 క్యూసెక్కులకు తగ్గించారు. గండికోట ప్రాజెక్టు, దాని అనుబంధ జలాశయాలు నీటిమట్టం పూర్తిస్థాయిలో చేరుతున్న నేపథ్యంలో కృష్ణాజలాలను తగ్గించారు. దీంతో గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి నీటి విడుదలను కూడా 7,500 నుంచి 2,500 క్యూసెక్కులకు తగ్గించినట్లు డీఈ తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

